క్లుప్తంగా

నియామకం

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): అటల్ భారత్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఇండియా జాతీయ సలహాదారులుగా ఖమ్మంకు చెందిన డాక్టర్ ఫర్మిల సంపత్ నియమితులయ్యారు. ఈమేరకు ఢిల్లీలో ఆ సంస్థ సీఈఓ దిలీప్ సీయాదవ్ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె తన నియాకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలుపగా పలువురు అభినందించారు.

డైట్ కళాశాల సందర్శన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని టేకులపల్లిలో గల డైట్ కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ యూనివర్సిటీ సెంటర్‌గా మార్పు చేయగా.. కళాశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కళాశాలలో చెట్లను తొలగించేందుకు అటవీ శాఖాధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఈనేపథ్యాన బుధవారం వారు కళాశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నట్లు కళాశాల బాధ్యులు తెలిపారు.

నష్టపరిహారం అందించాలి

ఖమ్మంరూరల్: అకాల వర్షంతో పంట నష్టపోయి నాలుగు నెలలైనా కొంతమంది రైతులకు నష్ట పరిహారం అందలేదని, వారికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నంద్ర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రైతులకు రుణమాఫీ కాక అప్పుల ఊబిలో కూరుకుపోయారని, తీరా పంట చేతికొచ్చే దశలో వర్షం రావడంతో ప్రధానంగా వరిపంట బాగా దెబ్బతిందన్నారు. అయినా ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రక్తదానం


రక్తదాతకు పండ్లు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని వీడీవోస్ కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం తాంద్ర రాంప్రసాద్ గురుస్వామి సంయుక్త ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో అయ్యప్ప భక్తులు రక్తదానం చేశారు. ఈ రక్తాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, గెల్లా శ్రీరాం, డాక్టర్ రాఘవరెడ్డి, డాక్టర్ డీపీసీ రావు, విశ్వేశ్వరరావు, కృష్ణమూర్తి, వి.వెంకయ్య, అలీం, డాక్టర్ సందీప్, ప్రభుత్వ వైద్యశాల ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి మార్గదర్శకం భగవద్గీత

కామేపల్లి: ప్రపంచ మానవళికి మార్గదర్శకమైన భగవద్గీత జయంతి వేడుకలను బుధవారం కామేపల్లిలోని అవధూతేంద్ర సరస్వతి స్వామి స్మృతి మందిరంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భగవాన్ నామ సంకీర్తన చేశారు. అనంతరం భగవద్గీత, గీతా పారాయణం బోధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో భక్త మండలి అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ, హన్మంతరావు, బైరోజు శ్రీనివాసచారి, నాగేష్, సాంబశివరావు, కేశగాని నాగయ్య, శ్రీనివాసరావు, ఆంగోత్ బాలాజీ, మనోజ్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

ఖమ్మం సహకారనగర్: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల డీఏలు వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ యూనియన్(టీపీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి రాధాకృష్ణరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, జీఓ నంబర్ 317తో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పూల రవీందర్‌ను బలపర్చాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, నాయకులు పడిగల రవికుమార్, చారి, పుట్టా శ్రీనివాస్, రామారావు, మధుసూదన్ పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో సూపర్‌నెట్ లాంచ్ ప్యాడ్ ఆధ్వర్యాన తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థులకు బుధవారం స్థాయి సామర్థ్య పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈమేరకు బహుళజాతి కంపెనీలు సూపర్‌నెట్ రూపొందించిన నివేదిక ఆధారంగా వారి వారి కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. అనంతరం కంపెనీ ప్రతినిధులకు జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, సూపర్‌నెట్ మేనేజర్ నీలా పాల్, కస్టమర్ సక్సెస్ మేనేజర్ శ్రేయాదాస్, కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్ర బాబు, ఎస్.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

సర్వే సా..గుతోంది!

- నర్వేను పరిశీలిస్తున్న అధికారులు
- నేటికి 10 శాతం వివరాలే నమోదు
- ఇంకా 10 రోజులు పట్టే అవకాశం


జింకలతండాలో సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షా రైనా

రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల మంజూరు చేయాలనే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే మండలంలో నత్తనడకన సాగుతుందని తెలుస్తోంది. మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఇళ్ల కోసం మొత్తం 16 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందించి అందులో వివరాలు నమోదు చేసేలా అధికారులు అవగాహన కల్పించారు. దీంతో గత మూడు రోజుల నుంచి మండలంలో సర్వే కొనసాగిస్తున్నారు.

మరో 10 రోజులకు పైగానే..

ఆయా గ్రామ పంచాయతీల వారీగా గ్రామ కార్యదర్శులు ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలోని 37 పంచాయతీల్లో 1600 మంది వివరాలు మాత్రం నమోదు చేసినట్లు తెలిసింది. అంటే మొత్తం మీద 10శాతం మేర పూర్తయినట్లు తెలుస్తోంది. ఒక్క రోజులో మండలం అంతా ఐదు లేదా ఆరు వందల లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఇలా మొత్తం ప్రక్రియ పూర్తవడానికి మరో 10 రోజులు పైగానే పట్టే అవకాశం ఉంది.

అధికారుల పరిశీలన..

సర్వే తీరును మంగళవారం జెడ్పీ సీఈఓ దీక్షా రైనా మండలంలోని జింకలతండా పంచాయతీలో పరిశీలించగా.. రఘునాథపాలెం పంచాయతీలో హౌసింగ్ ఈఈ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతీ దరఖాస్తుదాడి ఇంటికి వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేసి, ఫొటో తీసి అప్‌లోడ్ చేసే క్రమంలో సర్వేలో జాప్యం జరుగుతుందని గ్రామ కార్యదర్శులు చెబుతున్నారు.

కేఎంసీలో..


సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లాతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల జాబిత ప్రకారం వారి ఇళ్లకు వెళ్లి స్థలాన్ని పరిశీలించి సంబంధిత డాక్యుమెంట్ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గడువులోగా సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

పాండురంగాపురంలో..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురంలో మున్సిపల్ సిబ్బంది ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల జాబితా ప్రకారం ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఖాళీ స్థలం ఉండి అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ఇళ్ల నిర్మించుకోవడానికి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ డివిజన్ కమిటీ బాధ్యులు కాలువ నర్సింహారావు, చిన్న మల్లేశం, శీలం శ్రీను, డేగల ఉపేందర్, హెచ్.వెంకటేశ్వర్లు, జి.గోపి, చల్లా రాంబాబు, చింతల శ్రీను, రాంబాబు, హైమావతి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతులు

రాజీవ్ గృహకల్ప సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్ గృహకల్పలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకుడు ఏనుగు మహేష్ బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి విన్నవించారు. కాలనీకి సీసీ రోడ్లు మంజూరు చేయాలని, తాగునీటి వసతి కల్పించాలని మంత్రిని కోరారు. అనంతరం రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కూడా కలిసి విన్నవించారు.

ఎమ్మార్వోకు వినతి

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): రేషన్‌కార్డు లేనివారికి కార్డులతో పాటు ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిపాపన్న, జాతీయ ఉపాధ్యక్షుడు లంక వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్‌చార్జ్ ఎల్‌వీఆర్ ఆధ్వర్యాన ఖమ్మం అర్బన్, రూరల్ ఎమ్మార్వోలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి రాబడి, కుల సర్టిఫికెట్లు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్ ఇవ్వాలని కోరారు. వినతి అందించిన వారిలో మేళ్లచెరువు నాగమణి, కొత్తపల్లి నరసింహ, శ్రీను, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు..

మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యాన బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు నిమ్మలూరి రామకృష్ణ మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు పెండింగ్ మెనూ చార్జీలు విడుదల చేయాలన్నారు. వినతి అందించిన వారిలో వెంకటమ్మ, రాజ్యలక్ష్మి, సీత, పార్వతమ్మ, వెంకట్రావమ్మ, శిరోమణి, భారతి, వరలక్ష్మి, రంగమ్మ, కనకమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యువజన సంఘం నాయకులు

పీవైఎల్ ఆధ్వర్యాన..

నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని, ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేసింది. ఎన్నికల హామీలు అమలు చేయాలని, గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలను అరికట్టాలని, ప్రభుత్వ వైద్య వ్యవస్థను కాపాడాలని, ప్రైవేట్, కార్పొరేట్ వైద్యశాలల దోపిడీని అరికట్టాలన్నారు. వినతి అందించిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొర్రెపాటి రమేష్, సోమశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి బేతంపుడి నాగరాజు, ఉపాధ్యక్షులు ఎస్‌కె షబ్బీర్‌అలీ, శ్రీకాంత్, మోహన్‌రావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న నగర స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె నుంచి ఒలింపిక్ స్థాయి క్రీడల వరకు ఎదగాలని, అందుకు యువత శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, కేఎంసీ డీఈ ధరణి, మేనేజర్ విజయానంద్, కార్పొరేటర్లు అంజిరెడ్డి, తేజవత్ హుస్సేన్, బడిగెల శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.నర్సింహామూర్తి, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, వాలీబాల్ కోచ్ ఎం.డీ. అక్బర్ అలీ, పీడీ పీఈటీలు పాల్గొన్నారు.


వాలీబాల్ విజేత జెడ్పీఎస్ఎస్ ఇందిరానగర్ జట్టు

ఐదు క్రీడాంశాల్లో పోటీలు..

సీఎం కప్-2024లో భాగంగా ఐదు క్రీడాంశాల్లో పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో అథ్లెటిక్స్, వాలీబాల్, చెస్, యోగా, కరాటే అంశాల్లో పోటీలు నిర్వహించగా.. తొలి రోజు వాలీబాల్ బాలుర పోటీల్లో ఇందిరానగర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాల, బాలికల విభాగంలో రోటరీనగర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాల జట్లు గెలుపొందాయి. అలాగే మిగిలిన చెస్, యోగా, కరాటే వంటి పోటీల్లో పలువురు క్రీడాకారులు తమ సత్తా చాటి పతకాలు గెలుచుకున్నారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

రఘునాథపాలెం: మండలంలో వీవీపాలెం పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. రెండు రోజులు పాటు జరిగిన క్రీడల్లో సుమారు వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటారు. ఈమేరకు ఎంఈఓ రాములు, హెచ్ఎం శ్రీమన్నారాయణ, మాజీ ఎంపీటీసీ యరగర్ల హనుమంతురావు, గ్రామ కార్యదర్శి కృష్ణ తదితరులు విజేతలకు బహుమతులు అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి/ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని టౌన్-3 సెక్షన్ 11 కేవీ వీడీవోస్ కాలనీ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈఈ బి.తావుర్యా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కూసుమంచి మండలంలోని గైగోళ్లపల్లి ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పాలేరు ఏఈ తావుర్యా ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో గైగోళ్లపల్లి, లాల్‌సింగ్‌తండా, హటియాతండా, ఉడతలగూడెం, సంధ్యాతండా, చింతలతండా గ్రామాల పరిధిలో విద్యుత్ అంతరాయ ఉంటుందన్నారు. అలాగే నగరంలోని 11కేవీ రోటరీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు రోటరీనగర్, ఇందిరానగర్, రాజరాజేశ్వరి దేవాలయం ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ సెక్షన్ ఏఈ చావా లక్ష్మణ్ తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈలు కోరారు.

13న జీళ్లచెరువు ఆలయంలో బహిరంగ వేలం

కూసుమంచి: జీళ్లచెరువులోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వివిధ దుకాణాల ఏర్పాటుకు శుక్రవారం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బుధవారం తెలిపారు. దేవస్థానంలో కొబ్బరికాయలు, స్వీట్లు, పూలు, బొమ్మలు, బొంగుపేలాలు తదితర దుకాణాల ఏర్పాటుకు ఈ వేలం నిర్వహిస్తుండగా.. ఔత్సాహికులైన పాటదారులు పాల్గొనాలని ఆయన కోరారు.

15న నెలనెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 15(ఆదివారం) సాయంత్రం 6 గంటలకు నెలనెలా వెన్నెల 89వ అభ్యుదయ సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ కార్యదర్శి ఎ.సుబ్రమణ్యకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి ఆధ్వర్యాన 'నిశి'నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ఖమ్మం కళా పరిషత్, ప్రజా నాట్య మండలి సహకారంతో నిర్వహించే 89వ కదంబ కార్యక్రమాన్ని కళాకారులు, కళాభిమానులు విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఖమ్మానికి చేరిన ప్రజా రగ్ జోశ్ యాత్ర

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఈ నెల 8న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో ప్రారంభమైన ప్రజా రగ్ జోశ్ యాత్ర బుధవారం ఖమ్మం జెడ్పీసెంటర్‌కు చేరుకోగా వీరనారీమణుల ఆశయ సాధన జిల్లా అధక్ష, ప్రధాన కార్యదర్శులు భుక్యా ఉపేంద్రాబాయి, జ్యోతి స్వాగతం పలికారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు చందు, త్రివేణి, భవాని, విజయలక్ష్మి, ఝాన్సీ, సుశీల, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రజాసంఘాల ఐక్య వేదిక చైర్మన్ బానోత్ భద్రూనాయక్, నాగేంద్ర నాయక్, వీరన్ననాయక్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఖమ్మంమయూరిసెంర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఈనెల 15న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే టీయూసీఐ అనుబంధ తెలంగాణ ప్రొగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే లాల్మీ, టీయూసీఐ జిల్లా నాయకుడు కంకణాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఖమ్మం పీఎస్ఆర్ రోడ్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, నాగయ్య, రాము, నరేష్, వెంకటరెడ్డి, చంద్రయ్య, రాంబాబు, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభల పోస్టర్లు..


నేలకొండపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతిబంధకంగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి తొర్తి గురవయ్య డిమాండ్ చేశారు. మండలంలోని రాజేశ్వరపురంలో బుధవారం జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. ఈ నెల 14, 15 తేదీల్లో సత్తుపల్లిలో జరిగే యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చాటిన ప్రియ అనే విద్యార్థినిని సన్మానించారు. సంఘం మండల ఉపాధ్యక్షుడు అచ్చా విజయ్‌కుమార్, మండల కోశాధికారి జ్యోతి, రామారావు, నాగేశ్వరరావు, శివరామకృష్ణ, ఆదిత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీకి యూత్ నాయకులే కీలకం


వేణును అభినందిస్తున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

కామేపల్లి: కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ నాయకులే కీలకమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. ఇటీవల కామేపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైనా దొడ్డ వేణు బుధవారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో కలువగా.. ఆయనను సన్మానించిన సందర్భంగా పువ్వాళ్ల మాట్లాడారు. పార్టీ అభివృద్ధే లక్ష్యంగా యూత్ నాయకులు పని చేయాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడూ ప్రతిపక్షాల విమర్శలు తిప్పికొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, జిల్లా నాయకులు మద్దినేని రమేష్‌బాబు, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడికి నిరసన, ర్యాలీ


సీపీకి వినతిపత్రం ఇస్తున్న టీజేఎఫ్ నాయకులు


సీపీకి వినతిపత్రం ఇస్తున్న ఐజేయూ నాయకులు

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: హైదరాబాద్‌లో సినీ నటుడు మోహన్‌బాబు మీడియా ప్రతినిధులపై దాడి చేయడాన్ని జర్నలిస్టుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బుధవారం ఈమేరకు ఖమ్మంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ), టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆధ్వర్యాన వేర్వేరుగా ర్యాలీ నిర్వహించి పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. అదేవిధంగా నేలకొండపల్లిలో స్థానిక జర్నలిస్టులు నిరసన తెలిపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో వివిధ జర్నలిస్టుల సంఘాల బాధ్యులు వనం వెంకటేశ్వర్లు, ఆవుల శ్రీనివాస్, మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, శివ, మొహినుద్దీన్, జనార్దనాచారి, ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, సాంబశివరావు, అడపాల నాగేందర్, రజనీకాంత్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లి నిరసనలో పోలంపల్లి నాగేశ్వరరావు, మల్లేల ఉపేందర్, గొలుసు ఆంజనేయులు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, రాంబాబు, ఉపేందర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్ విజేతలకు అభినందనలు


ప్రతిభ చాటిన విద్యార్థులతో న్యూ ఇరా చైర్మన్ రమణారావు



విద్యార్థులను అభినందిస్తున్న విన్‌ఫీల్డ్ డైరెక్టర్లు పుల్లారావు, శ్రీకాంత్, కిషోర్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని బల్లేపల్లిలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయా పాఠశాలల యాజమాన్యాలు బుధవారం అభినందించాయి. ఈనేపథ్యాన సైన్స్‌ఫేర్‌లో తమ పాఠశాల నుంచి మూడు ప్రదర్శనలు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించాయని విన్‌ఫీల్డ్ పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, పోలవరపు శ్రీకాంత్, మన్నె కిషోర్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. అలాగే సైన్స్‌ఫేర్‌లో తమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనల్లో నాలుగు ప్రథమ స్థానాల్లో, రెండు ద్వితీయ స్థానాల్లో నిలిచాయని న్యూ ఇరా విద్యాసంస్థల చైర్మన్ ఐవీ రమణారావు, డైరెక్టర్ పి.భూమేశ్వరరావులు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి వెళ్లాయని పేర్కొంటూ విద్యార్థులను అభినందించారు. అంతేకాక ఖమ్మం శ్రీనగర్‌కాలనీలోని రెజొనెన్స్ స్కూల్ విద్యార్థులు శ్రీవల్లి, గాయత్రి రూపొందించిన బేబీ మానిటరింగ్ సిస్టమ్, అన్విత, చరిత రూపొందించిన ప్రాజెక్టులు న్యాయనిర్ణేతల మన్ననలు అందుకుంది. ఈ మేరకు విద్యార్థులను బుధవారం పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, రెజొనెన్స్ స్కూల్ డెరైక్టర్లు కొండా శ్రీధర్ రావు, కొండా కృష్ణవేణి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ, రెజొనెన్స్ పాఠశాల డైరెక్టర్లు

పాలేరులో కొత్త జీపీల ఏర్పాటుకు కసరత్తు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో కొత్తగా పలు గ్రామ పంచాయతీల ఏర్పాటుకు నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా.. త్వరలో అవి కార్యరూపం దాల్చనున్నాయి. వీటిలో తిరుమలాయపాలెం మండలంలో బంధంపల్లి, జాలుతండా, ఖమ్మంరూరల్ మండలంలో మద్దివారిగూడెం, సీతరామపురం, గుండ్లతండా, వాల్యాతండా,కూసుమంచి మండలంలో గోపాలరావుపేట, ఉడతలగూడెం, దుబ్బతండాను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయనుండగా.. ప్రస్తుతం జుజుల్‌రావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వాల్యాతండాను గురువాయిగూడెం గ్రామ పంచాయతీలో కలపాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈమేరకు కొత్తగా పంచాయతీలుగా ఏర్పాటయ్యే ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేసినట్లు కూసుమంచి ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అంతేకాక కొత్త గ్రామపంచాయతీల భౌగోళిక స్వరూపం, జనాభా తదితర వివరాలను ప్రభుత్వానికి పంచించనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో కొత్త పంచాయతీల ఏర్పాటుకు ఆమోదం లభించనున్నట్లు సమాచారం.

పాలాభిషేకం


తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీసివేసి కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని సచివాలయం ముందు ఏర్పాటు చేసి నిరంకుశ విధానాలు అవలంభిస్తుందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బుధవారం మండలంలోని తాళ్లచెరువు గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం చేసి ప్రభుత్వంపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న, బెల్లం వేణు, వేముల వీరయ్య, ఉన్నం బ్రహ్మయ్య, డీసీసీబీ డైరెక్టర్, తిరుమలాయపాలెం పీఏసీఎస్ చైర్మన్ చావా వేణుగోపాలకృష్ణతో పాటు జోగుపర్తి వెంకటేశ్వర్లు వాలూరి ప్రసాద్, మానుకొండ రాజా, వరప్రసాద్, బానోత్ రవి, పాల్గొన్నారు.

గుంతలతో దుర్గంధం..!

ఖమ్మం రామన్నపేట డబుల్ బెడ్రూం ప్రాంతంలో చుట్టుపక్కల నుంచి వచ్చిన మురుగు నీరు గుంతల్లో చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలకు నిలయంగా మారి విషజ్వరాల బారిన పడుతున్నమాని పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా నగర పాలక అధికారులు స్పందించి మురుగు గుంతలను పూడ్చి, పారిశుధ్య చేపట్టేలా చూడాలని నివాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– ఖమ్మం మామిళ్లగూడెం


డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద గుంతలో చేరిన మురుగు